క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఇటిక్యాల మండలం పెద్దదిన్నె గ్రామానికి చెందిన జయమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.13,500 చెక్కు మంజూరైనట్లు పేర్కొన్నారు.

వినాయక మండపానికి విరాళం

అలంపూర్: మున్సిపాలిటీలోని సాలేవీధిలో వినాయక విగ్రహ మండపానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆసీఫ్‌ఖాన్ రూ.20 వేలు విరాళం అందజేసినట్లు కమిటీ సభ్యులు, నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆసీఫ్‌ఖాన్‌ను కాలనీ వాసులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, మండప నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధికి..

గద్వాల: పట్టణంలోని అబ్బాస్ నూర్ మసీదు ల్యాండ్ అభివృద్ధికి షేరెల్లి వీధికి చెందిన కాలనీవాసులు రూ.42,250 విరాళాన్ని మసీదు ప్రెసిడెంట్ హాజీ మస్తాన్‌సాబ్‌కు అందజేశారు. కార్యక్రమంలో హనీఫ్, బాబా, ఖాజా, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడి నియామకం



అయిజ: జోగుళాంబ గద్వాల జిల్లా ముదిరాజ్ అధ్యక్షుడిగా మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. హైదరబాద్‌లో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ మహాసభ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ చొప్పరి శంకర్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన వెంకటేశ్వర్లుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిని పలువురు అభినందించారు.

స్వేరోస్ మండల కమిటీ ఎన్నిక



కేటీదొడ్డి: స్వేరోస్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా స్వేరోస్ అధ్యక్షుడు బండారి సునంద అధ్యక్షతన ఆదివారం మండల కేంద్రంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా కిష్టప్ప, ప్రధాన కార్యదర్శిగా వీరన్న, కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్వేరోస్ జాయింట్ సెక్రటరీ గాజుల కృష్ణ మాట్లాడుతూ.. ప్రవీణ్ కుమార్ ఆలోచన విధానాన్ని మనమందరం ముందుకు తీసుకెళ్లాలన్నారు. అంబేడ్కర్ కలలుగన్న ఆశయాలు నెరవేర్చుటకు స్వేరోస్ ముందుటుందని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ బురదమయం



మానవపాడు: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ బురదమయంగా తయారైంది. ఆదివారం కురిసిన వర్షానికి బస్టాండ్ ఆవరణలో వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అడుగుతీసి అడుగేయాడానికి అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆత్మకూర్: సబ్ జూనియర్ సైక్లింగ్ పోటీలకు ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థిని సిరి ఎంపికైనట్లు మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. తమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని సిరి నారాయణపేటలో జరిగిన ఐదు కిలోమీటర్ల సబ్ జూనియర్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు. ఖేలో ఇండియా సబ్ జూనియర్ పోటీలకు ఎంపికై హైదరాబాద్ నాగోల్ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ప్రోత్సహించినా.. ముందుకు రావట్లే

- మంజూరైన ప్రారంభం కాని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- ఒత్తిడి తెస్తున్న మున్సిపల్ అధికారులు
- ఆషాడమాసం, వర్షాలు అడ్డంకి అంటున్న లబ్ధిదారులు



అయిజ పాతబస్టాండ్ కాలనీలో పునాది దశలో ఉన్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకం నత్తనడకన సాగుతోంది. మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉన్నాయి. మొదటి విడతలో భాగంగా సర్వే అనంతరం 287 ఇళ్లకు ఆమోదం తెలిపి ప్రొసీడింగ్ రూపొందించారు. వాటిలో 163 ఇళ్లకు గ్రౌడింగ్ జియో ట్యాగింగ్ చేశారు. వాటిలో కేవలం 6 ఇళ్లు మాత్రమే బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి కాగా 42 ఇళ్ల బేస్‌మెంట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇంకా 76 ఇళ్లకు గ్రౌడింగ్ చేయాల్సి ఉంది.

వర్షాలతో నిర్మాణాలు వాయిదా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులకు ఒక వైపు వర్షాలు పడుతుండటం, రైతులు, రైతు



ఎస్సీ కాలనీలో బేస్‌మెంట్ దశలో ఉన్న నిర్మాణం

కూలీలు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండటంతో ఇళ్ల నిర్మాణ పనులు వాయిదా వేస్తున్నారు. ఎంత ప్రోత్సహించినా సరే అనేక మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించడం లేదని అధికారులు వాపోతున్నారు. మరొకొందరైతే నిర్మాణాలు చేపట్టేందుకు డబ్బు సమకూరడం లేదని ప్రభుత్వం ముందస్తుగా సాయం చేయాలని కోరుతున్నారు.

మున్సిపల్ సిబ్బందిపై ఒత్తిడి

లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించేలా ప్రోత్సహించాలని జిల్లాస్థాయి అధికారులు మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో కిందిస్థాయి సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నిర్మాణ పనులు ప్రారంభించాలని బతిమలాడుతున్నా సరే లబ్ధిదారులు మాత్రం నిర్మాణం పనులను ప్రారంభంచిడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

వ్యవసాయ పనుల్లో నిమగ్నం



ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా సరే వర్షాకాలంలో ఇంటి నిర్మాణం చేపట్టడానికి అనువుగా లేదు. ఎక్కువ శాతం రైతులు, వ్యవసాయ కూలీలు ఉండడంతో పొలం పనులకు వెళ్తారు. ఇది వరకే పనులు ప్రారంభించిన వారు కూడా పనులు నిలిపివేశారు. నిర్మాణ చేపట్టాలని అధికారులు ఒత్తిడి తేకుండా చూడాలి.

– తిరుమలరెడ్డి, అయిజ

డబ్బు సమకూరడం లేదు



ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన డబ్బు సమకూరక పోవడంతో నిర్మాణ పనులు ప్రారంభించలేక పోతున్నాం. రైతులకు పెట్టుబడుల కాలం, కూలీలు పనుల కాలం కావడంతో కూలీల సమస్య ఏర్పడుతుంది. పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం ముందస్తుగా కొంత డబ్బు చెల్లిస్తే బాగుంటుంది.

– ఖాజా, అయిజ

లక్ష్యాన్ని అందుకోలేదు



మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జూలై ఆఖరు నాటికి ప్రారంభించాలని ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు ఉన్నాయి. లబ్ధిదారులను ప్రోత్సహించి నిర్మాణం పనులు ప్రారంభించాలని సిబ్బందిపై ఎంత ఒత్తిడి తెచ్చినాసరే అనుకున్న సమయానికి లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం.

– సీహెచ్ సైదులు, మున్సిపల్ కమిషనర్

కొనసాగుతున్న సప్తాహ భజన



మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు భజనలో పాల్గొన్నారు. భజనకు వచ్చే మండలి సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు

అయిజ: ఖరీఫ్ సాగుకు సరిపడా ఎరువులు లేవనే వదంతులను నమ్మిన రైతులు అవసరానికంటే ఎక్కువ మొత్తంలో ఎరువులు కొనుగోలు చేస్తున్నారని, ఎరువుల కొరత లేదని సింగిల్ విండో ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్ విండో గోదాంలో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల కోసం మండలంలోని చిన్న తాండ్రపాడు గ్రామంలో ఎరువుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీదే గెలుపు



మాట్లాడుతున్న జయలక్ష్మి

రాజోళి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే గెలుపని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జయలక్ష్మి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసింది బీజేపీనేనన్నారు. గ్రామ పంచాయతీలకు నేరుగా బడ్జెట్‌ను కేటాయించి, వైకుంఠ దామాలు, పల్లె ప్రకృతి వనాలు లాంటి అభివృద్ధి పథకాలకు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మరన్నారు. కార్యకర్తలు ప్రధాని మోదీ చేసిన అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కులమతాలకు అతీతంగా దేశాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నరేంద్ర మోదీ పాలనను తెలంగాణలోని గ్రామాలన్నీ ముక్తకంఠంతో సమర్థిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, అంజనేయులు, అడివిస్వామి, వీరేష్, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌ఆర్మీ గ్రామ కమిటీ ఎన్నిక



అయిజ: మండలంలోని కుటుకనూరులో ఆదివారం భీమ్‌ఆర్మీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రభుదాస్, ఉపాధ్యక్షుడిగా విల్సన్, కోశాధికారిగా సామెల్, చీఫ్ సెక్రటరీగా రవికుమార్, కార్యదర్శులుగా అనిల్, ప్రేమరాజు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రకాష్, మోజేష్, ప్రసాద్, కృపాకర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మానవపాడు: మండలంలోని బాలుర వసతి గృహంలో ఆదివారం విద్యార్థులు, సిబ్బంది ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అర్చకులు

రాజోళి: మండల కేంద్రం రాజోళిలోని అడివిస్వామి ఆలయ ప్రాంగణం, తహసీల్దార్ కార్యాలయ సమీపంలో అర్చకులు మొక్కలు నాటారు. మొక్క దేవుడితో సమానమన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా కుటుంబ సభ్యులతో సమానంగా మొక్కలు పెంచాలన్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకం



ఆదివారం ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్న దృశ్యం

రాజోళి: వడ్డేపల్లి మండలం తనగల గ్రామ సమీపంలోని తనగల గట్టుపై ఎర్రమట్టిని కొల్లగొడుతున్నారు. అనుమతులు ఉన్నాయనే సాకుతో సెలవు రోజుల్లో కూడా స్పీడు తగ్గకుండా అక్రమంగా తోలుకుంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతుల చాటున అక్రమంగా మట్టిని తనగల, పచ్చర్ల, మాన్‌దొడ్డి గ్రామాలకు దూరాన్ని బట్టి తరలించి డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. గట్టులన్ని తవ్వి రహదారులకని తీసుకెళ్తంటే గ్రామాల్లో అవసరాలకు మట్టిని ఎక్కడ నుంచి తెచ్చుకోవాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదభరితంగా కుర్తిరావులచెర్వు కల్వర్టు



మల్దకల్- కుర్తిరావులచెర్వు రహదారిలో ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు

మల్దకల్: మండలంలోని కుర్తిరావులచెర్వు- మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు రక్షణ గోడ కూలి ప్రమాదభరితంగా మారింది. ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాల్వపై ఏర్పాటు చేసిన కల్వర్టు కొద్దిరోజుల క్రితం కూలిపోయింది. రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాహనదారులు, గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలి



కాలనీలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మున్సిపాలిటీలోని నరసింహ కాలనీలో సీసీరోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి కోరారు. ఆదివారం కాలనీలో సందర్శించిన బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కాలనీలో మురుగు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. చెత్తను సేకరించే వాహనాలు రాకపోవడంతో రోడ్లపై చెత్త పేరుకుపోయినట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య లోపంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే కాలనీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌గౌడ్, రాముడు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన పౌష్టికాహారం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: మండల పరిదిలోని ఉప్పేరు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఆదివారం మధ్యాహ్నం హాస్టల్‌కు చేరుకొని నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచి, పౌష్టికరమైన భోజనం అందించాలని వార్డెన్ సుధీర్‌గౌడ్‌కు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కంచె ఏర్పాటు చేయరూ..



రక్షణ కంచె లేకుండా ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఇటిక్యాల: మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో భయాందోళనలో ఉన్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ కంచె లేకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నట్లు పేర్కొన్నారు. నిత్యం విద్యార్థులు ఇదే దారి గుండా వెళ్తున్నారని ప్రమాదం సంభవించకముందే ఉన్నతాధికారులు స్పందించిరక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో భాగవత పారాయణం



భాగవత పారాయణం చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన భాగవత పారాయణ మహాయజ్ఞం ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగింది. ఆలయంలో మూడో రోజు అర్చకులు ఆరవ స్కందంలోని చిత్రకేతుని కథ, అజమాలుని కథ, నారాయణ కవచం, వృతార్జుష వృత్తాంతం గురించి అవగాహన కల్పించి వాటి భావాలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆయన పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు



మానవపాడు: మండల కేంద్రం నుంచి చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల మీదుగా అలంపూర్ చౌరస్తాకు వెళ్లే రహదారిపై గుంతలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి కనీసం మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అయిజ: మండల కేంద్రంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ఎస్‌ఓ చెన్న బసమ్మ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సీఈసీ మొదటి సంవత్సరంలో 10 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 10 సీట్లు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు.

హక్కుల కోసం పోరాటానికి సిద్ధం కావాలి

అమరచింత(ఆత్మకూర్): బీడీ కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధమవ్వాలని టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవాదీనం అన్నారు. ఆదివారం పట్టణంలోని మార్క్స్ భవనంలో బీడీ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ నెల 31న చలో కలెక్టరేట్ పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, సామేలు, రాజు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన ఏది?

- పేరుకే డిజాస్టర్ కమిటీలు
- 5 మంది సభ్యులతో గ్రామ, మండల కమిటీలు
- గ్రామాల్లో అవగాహన కన్పించని వైనం



సమావేశంలో చర్చిస్తున్న మండల విపత్తు నిర్వహణ కమిటీ(ఫైల్)

రాజోళి: వర్షాకాలంలో పాత భవనాలు కూలడం, వాగులు, వంకలు పొంగడం నదీతీర గ్రామాల్లో పంటలు నీట మునగడం, జాలర్లు, గ్రామస్తులు వరదలో కొట్టుకొని పోవడం జరుగుతుంటాయి. వీటన్నింటిపై అప్రమత్తం చేసేందుకు అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తుంటారు. దాని కోసం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, విపత్తులపై నివేదికలను అందజేస్తూ ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మండలంలో గ్రామాల వారీగా విపత్తు నిర్వహణ(డిజాస్టర్ మేనేజ్‌మెంట్) కమిటీలు ఏర్పాటు చేశారు. కానీ నేటి వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామ, మండల స్థాయిలో

వర్షాకాలం ప్రారంభానికి ముందే గ్రామంలో పంచాయతీ సెక్రటరీ, ఆర్ఐ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్త, పోలీస్ సిబ్బంది కమిటీ సభ్యులుగా ఉంటారు. వారు గ్రామస్థాయిలో జరిగే విపత్తులపై మండల కమిటీలకు సమాచారం అందించాలి. మండల కమిటీలో తహసీల్దార్, ఎస్ఐ, ఎంపీడీఓ, ఎంఏఓ, వైద్యాధికారి, పశు వైద్యాధికారి ఉంటారు. ప్రధాన శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది కమిటీల్లో ఉండటంతో వర్షాల వల్ల కలిగే పంట, ఇతర నష్టాలను అంచనా వేస్తారు.

పర్యటించని కమిటీలు

వర్షాకాలం ప్రారంభమైనా.. పెద్దగా వర్షాలు కురవని కారణంగా గ్రామాల్లో విపత్తు కమిటీలు అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదని అధికారులు పేర్కొంటున్నారు. కానీ వర్షాలు రాక ముందే, నష్టాలు జరగకముందే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే అంశాలపై ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంది. ఒకేసారి అధిక వర్షాలు కురిస్తే పాత భవనాలు కూలి, అందులో ఉండే వారికి ప్రాణ నష్టం జరగవచ్చని ప్రజలు అంటున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకముందే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి మందులు వాడాలని వైద్యశాఖ సిబ్బంది ముందస్తు సలహాలు ఇవ్వాలని, కానీ అలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తం చేశాం

వర్షాకాలం కావడంతో గ్రామాల్లో నష్టాలు జరిగే అవకాశాలు ఉంది. వాటిని దృష్టిలో పెట్టుకొని గ్రామ కమిటీలు ఏర్పాటు చేశాం. పెద్ద మొత్తంలో వర్షాలు కురవని కారణంగా, ఎలాంటి నష్టాలు ఇప్పటిదాకా మండలంలో చోటు చేసుకోలేదు. కానీ గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు తప్పనిసరిగా చిన్నపాటి నష్టాన్ని కూడా తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించాం.

– రామ్మోహన్, తహసీల్దార్, రాజోళి

ఎప్పటికప్పుడు సమీక్ష

మండల కమిటీలో ఉన్న వారు, ఎప్పటికప్పుడు గ్రామ కమిటీలతో సమీక్ష చేస్తున్నాం. పంటలు, పాత భవనాలు గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. నదీతీర గ్రామాల్లో అప్రమత్తత అంశాలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. గ్రామ కమిటీలు యువకులు, పెద్దలతో సమన్వయం చేసి చర్యలు చేపట్టేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– ఖాజా మొయినుద్దీన్, ఎంపీఓ, రాజోళి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల – కె.నీలాంజనుడు – 9642913894
అలంపూర్/అయిజ – ఎస్.గోవర్ధన్ – 9948797122
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బర్ లాల్ : 9553955603